## భీమవరం ఎక్సైజ్ స్టేషన్ దాడులలో
## బెల్ట్ షాపు నిర్వా హకుడి అరెస్టు,7 మద్యం సీసాల స్వాధీనం....



**అక్షరవిజేత,భీమవరం :**

భీమవరం ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ ఈ రోజు నిర్వహించిన దాడులలో భీమవరం మండలం, దిరుసు మర్రు గ్రామం లో జి.బాబులు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్దనుండి 07 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దాడుల లో ఎస్ఐలు పి.ఉమా మహేశ్వరరావు, పి. సునీల్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వ హిస్తే కఠిన చర్యలు తప్పవని భీమవరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె.బలరామరాజు తెలియ చేశారు.

## జిల్లా ఎం ఆర్ సి అధ్యక్షునిగా చక్రపాణి




**అక్షర విజేత పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:**

గ్రామీణ నీటిపారుదల, పారిశుద్ధ్య శాఖ విభాగంలో పనిచేస్తున్న మండల రిసోర్స్ కోఆర్డినేటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కే మధుమోహన్ చక్రపాణి( భీమవరం), ఉపాధ్యక్షునిగా కొండే ఆనంద్ కుమార్ ( అత్తిలి), ప్రధాన కార్యదర్శిగా గాదాపు సతీష్ కుమార్ ( పెంటపాడు), కోశాధికారిగా మాకా బాబ్జి( పెనుగొండ), సహాయ కార్యదర్శిగా పెన్మత్స రంగరాజు ( నరసాపురం) లతోపాటు మరో పదిమంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సంఘ అభ్యున్నతికి, బలోపేతానికి కమిటీ పూర్తిస్థాయిలో పనిచేసేందుకు కట్టుబడి ఉంటామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన మధుమోహన చక్రపాణిని, కమిటీ సభ్యులను జిల్లా ఇంజనీరింగ్ అధికారి వి గిరి అభినందించారు. ఇంజనీరింగ్ విభాగంలో ఎమ్మార్సీలు అంతా కీలకంగా వ్యవహరించి ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజా సేవలో ఉండాలని సూచించారు.

## అమ్మవారికి ప్రవాస భారతీయుని విరాళం



**అక్షర విజేత పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:**

తాడేపల్లిగూడెంలోని శంకరమఠంలో వేంచేసి ఉన్న సర్వమంగళ అమ్మవారికి కాలిఫోర్నియాకు చెందిన ప్రవాహ భారతీయుడు శంఖుభ ట్ల మురళీకృష్ణ జ్యోత్స్న దంపతులు ఐదు లక్షల రూపాయలు విరాళం ఇచ్చారు. పీఠంలోనీ ముముక్ష్యు వేద పాఠశాల, గోశాల నిర్మాణానికి విరాళం ఇచ్చారు.

## బాకీ డబ్బులు అడిగితే
## చంపుతానని దౌర్జన్యం చేస్తున్నాడు!

### మానసికంగా వేధిస్తున్నాడు.
### ఏ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జె కే ఆర్ పై
### రిటైర్డ్సూపరింటెండెంట్ రవీంద్ర ఆరోపణప్రెస్ క్లబ్ నందు
### విలేకరుల సమావేశం ఏర్పాటు



**అక్షర విజేత మంగళగిరి**

తనకు ఇవ్వాల్సిన బాకీ డబ్బులు అడిగితే ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు చంపుతానని బెదిరిస్తున్నాడని రెవెన్యూ విభాగ రిటైర్డ్ సూపరింటెండెంట్ రవీంద్ర ఆరోపించారు. ఈ మేరకు బుధవారం గౌతమ బుద్ధ రోడ్డు వెంబడి నగరపాలక సంస్థ కార్యాలయం ప్రక్కన గల మంగళగిరి ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గత రెండు సంవత్సరాల క్రితం హైదరాబాద్ శివారులోని కందుకూరు మండలం పులిమామిడి గ్రామంలో జంజనం కోటేశ్వరరావు జెకెఆర్ గ్రూప్ పేరిట వెంచర్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. రూ 18 లక్షలు నగదు చెల్లించి ప్లాట్ కొనుగోలుకు సేల్ ఆఫ్ అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఆ తర్వాత వెంచర్ నిర్మాణం ఆగిపోయిందని, కట్టిన అడ్వాన్స్ నగదు రూ.18 లక్షలు తిరిగి ఇస్తానని, నమ్మిస్తూ వస్తున్నాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఏ ఆర్ ఎస్ పార్టీని స్థాపిస్తున్నానని, తన పార్టీ అధికారంలోకి వచ్చాక తిరిగి డబ్బులు ఇచ్చేస్తానని మాయమాటలు చెప్పాడని ఆరోపించారు. డబ్బులు అడిగిన పలు సందర్భాల్లో తనపై జెకెఆర్ అనుచరులతో కలిసి దాడికి దిగినట్లు పేర్కొన్నారు. చివరి ఎన్నికల ఫలితాల సమయంలోను తనపై జె కే ఆర్ దౌర్జన్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. జంజనం కోటేశ్వరరావు వలన తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ గుంటూరులో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ జెకె ఆర్ తన అనుచరులతో బెదిరింపులకు పాల్పడటం ఆపలేదని వాపోయారు. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న జెకేఆర్ పై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, తనలాంటి బాధితులు ఎంతో మంది వెలుగులోకి వస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు.

## ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని
## విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు

**అక్షరవిజేత. రామకుప్పం:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని అలాంటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అభివృద్ధి పితామహుడుగా నిలిచారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పిలుపునిచ్చారు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు మరియు ముఖ్య నేతలతో ఆయన సమావేశమై పార్టీ మరియు ప్రభుత్వ కార్యక్రమాలు పనితీరుపై సమీక్షించారు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు అన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఇదివరకే మండల వ్యాప్తంగా నిర్వహించిన పంచాయతీ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఎన్నుకున్న కార్యవర్గ జాబితాను పార్టీ సభ్యత్వ సంఖ్య మరియు ఓటర్ ఐడి తో అనుసంధానం చేసి పూర్తిస్థాయిలో మండల కార్యాలయానికి అందజేయాలని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునుస్వామి, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణ,మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ఆనంద రెడ్డి, నర్సింహులు, మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు సీతాపతి, మాజీ రెస్కో డైరెక్టర్ రామమూర్తి,జయశంకర్, కామరాజు నాయక్, మనోహర్, మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప, యూనిట్ ఇన్చార్జిలు జేఈ, చంద్రారెడ్డి, గజేంద్ర, వెంకటరమణ, కృష్ణ ,ముఖ్య నేతలు గిరి దాస్,విజయ్ కుమార్ రెడ్డి, అల్లి శ్రీను, అవినాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా తల్లికి వందనం పథకం...తోట సీతారామలక్ష్మి...

**అక్షరవిజేత,భీమవరం:**



ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా అమలు చేసిన తల్లికి వందనం పథకం పై వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని భీమవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పోలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారా మలక్ష్మి తెలిపారు.ఎన్డీఏ కూటమి ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కుటమి మంత్రులు అధికారులతో రాష్ట్ర అభివృద్ధికి పనిచేస్తూ ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని తల్లికి వందనం పథకం ద్వారా పారదర్శకంగా 8,700 కోట్ల రూపాయలను 67 లక్షల మంది విద్యార్థుల తల్లులబ్యాంకు ఖాతాలలో జమ చేయగా ఈవిషయాన్ని ఊహించుకోలేని వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలను చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పేరుతో ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి ఆర్థిక సహాయం చేస్తామని కేవలం ఒక్కరికి మాత్రమే లబ్ది చేకూర్చారని ఎన్డీఏ ప్రభుత్వం స్కూలు తెరిచిన వెంటనే తల్లికి వందనం అందజేయగా వైసీపీ ప్రభుత్వ హయాంలో స్కూలు తెరిచినా విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లితండ్రులు జగన్ సహాయం కోసం ఎదురు చూసేవారిని తల్లికి గౌరవం ఇవ్వలేని జగన్ తల్లికి వందనం పథకంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు.వైసిపి పాలనలో అమ్మఒడికి 13 వేల రూపాయలు ఇచ్చేవారని మరి మిగిలిన 2 వెలు జగన్ జేబులోకి పోయాయా తాడేపల్లి ప్యాలెస్ కు పోయాయా అని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి విద్యార్థిని విద్యార్థుల తల్లులకు పథకం వర్తింపచేయాలని నారా లోకేష్ కృషి చేస్తున్నారని తల్లికి వందనం పథకం రానివారు మీసచివాలయాలలో ఫిర్యాదు ద్వారా సహాయం పొంద వచ్చని తెలిపారు.

## అందుబాటులోకి కార్పొరేట్ స్థాయి వైద్యం....

### భీమవరంలో ఆదిత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను
### ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు.....

**అక్షరవిజేత,భీమవరం :**






పట్టణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవల అందాలంటే వేరే ప్రాంతాలకు వెళ్లేవారని, ప్రస్తుతం మన భీమవరంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజి బాబు) అన్నారు. భీమవరం జెపి రోడ్డులో ఆదిత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను మంగళవారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. వైద్యరంగంలో పెను మార్పులు వచ్చాయని, ఆ మార్పులకు అనుగుణంగా సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయని, ఈ ఆస్పత్రి ద్వారా సామాన్యులకు కూడా అందుబాటులో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుతాయని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు కూడా అందుబాటులో వైద్యాన్ని అందించేలా కృషి చేయాలని అన్నారు. డాక్టర్లు బి అశోక్ కుమార్, డా రత్న ఆదిత్య మాట్లాడుతూ ఆత్యాధునిక సాంకేతిక టెక్నాలజీతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలను అందిస్తున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబును సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మోడీ పాలనలోనే దేశాభివృద్ధి

### రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం చేయుత
### గూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్
### కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు శ్రీనివాస వర్మలకు
### కృతజ్ఞతలు

**అక్షర విజేత పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:**




నరేంద్ర మోడీ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వ పాలనలో దేశం అన్నీ రంగాల్లో అభివృద్ధి ని సాధిస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు.వికసిత భారత్ అమృతకాలం 11 సంవత్సరాల మోడీ గారి సుపరిపాలన సేవ సంక్షేమ పథకాల వికసిత్ భారత్ సంకల్ప సభను నియోజవర్గ స్థాయిలో తాడేపల్లిగూడెం గమిని ఫంక్షన్ ప్లాజాలో నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధి పాల్గొన్న తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ కృషి తో తాడేపల్లిగూడెం కు విమానాశ్రయం మంజూరు అయిందని వెల్లడించారు. నరేంద్ర మోడీ నాయకత్వం లోని ఎన్ డి ఏ కూటమి డబల్ ఇంజన్ సర్కార్ తో ముందుకు దూసుకుపోతూ దేశాన్ని అన్నీ రంగాల్లోను అభివృద్ధి చేస్తోందని ప్రశ%శీ%సించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. దేశభద్రత, అభివృద్ధి లో నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. 11 సంవత్సరాల మోడీ గారి సుపరిపాలన కోసం వక్తగా విచ్చేసిన శరణాల మాలతీ రాణి మాట్లాడుతూ నరేంద్ర మోడీ పరిపాలనలో జరిగే అభివృద్ధి చారిత్రకమన్నారు. ప్రపంచ దేశాలలో భారత దేశ కీర్తిప్రతిష్టలు ఇనుమడించాయని తెలిపారు. ఉగ్రదేశం పాక్ దుశ్చర్యలను ఆపరేషన్ సింధూర్ తో తిప్పికొట్టి ప్రపంచదేశాలకు మనదేశ శక్తి సమర్థ్య లను చాటిచెప్పిందని వివరించారు. దేశభివృద్ధికి దోహదపడే ఉత్పత్తి రంగాన్ని మోడీ ప్రభుత్వం విశేషంగా అభివృద్ధి చేసి ఉపాధిని విస్తరించిందన్నారు. మోడీ పరిపాలనతో ప్రపంచంలో 4వ ఆర్థిక శక్తిగా దేశం అభివృద్ధి చెందిందన్నారు.మేడ్ ఇండియా నుంచి భేటీ పడావో.. భేటీ బచావో, జన ఔషది, గతి శక్తి వంటి పథకాలను అమలు చేస్తూ దేశాన్ని మహిళలు, యువత, విద్యార్థులు, పరిశ్రమలు, సంక్షేమ రంగాలను అభివృద్ధి చేసి ఎంతో మందికి ఉపాధికల్పించారని వివరించారు. బిజెపి జిల్లా పూర్వధ్యక్షులు నార్నె తాతాజీ మాట్లాడుతూ కాంగ్రెస్ పదేళ్ల పాలనలో దేశాన్ని ఆర్థికంగా దోచుకుతిన్నారని, దేశప్రగతిని అదోగతిపాలు చేశారని ధ్వజమెత్తారు.కేంద్రంలో 2014 లో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టాక దేశం ఏవిధంగా ఆర్థికంగా దోపిడీకి గురవుతోంది, నిధులు ఎలా పక్కదారి పడుతున్నాయని పరిశీలించి నిధులదోపిడి, వృధాను అరికట్టి సమగ్ర ప్రణాళిక తో దేశప్రగతికి బాటలు వేశారని ప్రశ%శీ%శించారు. ప్రముఖ పారిశ్రామిక, వ్యాపారవేత్త నంద్యాల కృష్ణ మూర్తి మాట్లాడుతూ నరేంద్ర మోడీ పాలనలో దేశం ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి వెల్లివిరుస్తోందని, కేంద్రం సహకారంతో మరింత అభివృద్ధి ని సాధించగలదని విశ్వాసం వ్యక్తం చేసారు. సభాధ్యక్షులు ఈతకోట తాతాజీ మాట్లాడుతూ నరేంద్ర మోడీ పరిపాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, పెదపోలు వీర రాఘవులు,బిజెపి పార్లమెంట్ మీడియా ఇంచార్చ్ నరిసే సోమేశ్వర రావు,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొండపల్లి నగేష్, గూడెం పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, రూరల్ అధ్యక్షులు సమయమంతుల కాశీ, పెంటపాడు మండల అధ్యక్షులు దత్తు ప్రసాద్, కో కన్వీనర్ రామగాని సత్యనారాయణ,వాసవి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ, తెలుగు దేశం నేతలు కోడూరి సుబ్బరాజు, పట్నాల రాంప%శీ%డు, కిలపర్తి వెంకటరావు, జనసేన నేత పాలూరి వెంకటేశ్వర రావు,పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ,కిసాన్ మోర్చా నేత గట్టిం మాణిక్యాల రావుతదితర నాయకులు మాట్లాడారు.వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు, బిజెపి, జనసేన, టిడిపి, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### శోభాయమానంగా సాగిన యోగాసనం..

### కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల జిల్లా అధికారులు



**అక్షరవిజేత,కామవరపుకోట :**

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుంటుపల్లి బౌద్ధరామం యోగాసనాలతో సందడి నెలకొంది. బుధవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గుంటుపల్లి బౌద్ధరామంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు ఘంటా మురళీ రామకృష్ణ, ఐటిడిఏ పివో రాముల నాయక్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, సెట్ వెల్ సిఇఓ ప్రబాకర్, పర్యాటకశాఖ జిల్లామేనేజరు పట్టాభి, తహశీల్దారు ఎలీజ, యంపిడివో కె. సరళకుమారి, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 1,037 మంది పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యులు ఘంటా మురళీరామకృష్ణ మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా యోగాకేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలజీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపడం మన అందరికి గర్వకారణమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో భారత ప్రధాని నరేంధ్ర మోది, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటున్నారని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఐటిడిఏ పివో రాముల నాయక్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో బాగంగా జిల్లాలోని నాలుగు ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరిగిందన్నారు. డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి నేతృత్వంలో గత నెల 21వతేదీ నుండి యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున నిర్వహించుకుంటున్నామన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగాదినోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 21న భారీస్థాయిలో యోగాసనాల కార్యక్రమం నిర్వహించడానికి గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో గుర్తించిన 5,053 వేదికల్లో ఆరోజు యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వామి అయ్యేందుకు జిల్లాలో ఇంతవరకు 8,60,072 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోవడం అభినందనీయమన్నారు.

## మాతృభాష ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి



**అక్షర విజేత అరకులోయ.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతాలలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆదివాసి మాతృభాష ఉపాధ్యాయులను తక్షణమే విధులలోకి తీసుకోవాలని ఏపీ ఆదివాసి మాతృ బహు భాష ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధి రమేష్ నాగేంద్ర డిమాండ్ చేసారు. బుధవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాతృ బహుభాష ఉపాధ్యాయుల సమస్యలపై ఏకరువు పెట్టారు. 2025–26 విద్యాసంవత్సరం ప్రారంభమై వారం రోజులు కావస్తున్నప్పటికీ ఇంతవరకు మాతృభాష ఉపాధ్యాయులను విధులకు పంపించే విధంగా ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలు జారీ చేయకపోవడం విచారకరమని ఆయన వాపోయారు. గత ఏడాది ఆదివాసి మారుమూల గ్రామాల పాఠశాలల్లో బహుభాష ఉపాధ్యాయులె విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఆయినప్పటికీ వారిని తిరిగి ఈ విద్యా సంవత్సరంలో విధుల్లోకి తీసుకోవడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ప్రశ్నించారు. ప్రాథమిక స్థాయిలో బాలబాలికల అక్షరాస్యత నైపుణ్యానికి ఎంతగానో కృషి చేస్తూ ప్రభుత్వ సేవకులుగా ఉంటూ తక్కువ వేతనానికి పనిచేస్తున్న మాతృభాష ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 676 మంది బహు భాష ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ ఉపాధ్యాయులు అంతా కువి, ఆదివాసి ఒరియా, కొండ తదితర భాష ప్రాధాన్యత ఇస్తూ అహర్నిశలు కృషి చేస్తున్న మాతృభాష ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాతృభాష ఉపాధ్యాయులను తక్షణమే విధులలోకి తీసుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఉద్యమాలు చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు.

## కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదు....

### మహిళలపై దాడులు.. రాక్షస పరిపాలన సాగుతుంది

### మహిళలపై దాడి చేసిన టీడీపీ కార్యకర్తను కఠినంగా శిక్షించాలి

### తల్లికి వందనం కాదు ..తండ్రికి మాత్రం బుడ్డి ఇచ్చారు.. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి విమర్శలు

**అక్షరవిజేత,భీమవరం**



కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదని, రాక్షస పరిపాలన సాగుతుందని, మహిళలపై దాడులు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ మహిళ జిల్లా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి విమర్శించారు. బుధవారం భీమవరంలో జరిగిన మహిళల సమావేశంలో కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్త ఓ మహిళను నడిరోడ్డుపై అసభ్య పద జాలంతో దూషించడమే కాకుండా రోడ్డుపై ఈడ్చుకెళ్లి చెట్టుకు తాళ్లతో కట్టేసి చిత్రహింసలకు గురి చేశారని, ఇది సభ్య సమాజం తలదించుకునే ఈ ఘటన అని అన్నారు. దిక్కుతోచని స్థితిలో ఆ మహిళ అలాగే నరకం అనుభవించిందని, టీడీపీ కార్యకర్తపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం ఏమో గానీ తండ్రికి మాత్రం బుడ్డి ఇచ్చారని విజయలక్ష్మి విమ ర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో కనికట్టు చేస్తోందని, అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయలేక అంకెల గారడీ చేస్తున్నారని, కొంత మందికి మాత్రమే ఇచ్చి అందరికీ ఇచ్చినట్లు కనికట్టు చేస్తున్నారన్నారు. నిజంగా అందరికీ ఇచ్చి ఉంటే ఊరూరా మహిళలు ఎందుకు ఆందోళనలు చేస్తున్నారో స్కూళ్ల చుట్టూ, సచివాల యాల చుట్టూ, విద్యుత్ ఆఫీసుల చుట్టూ ఎందుకు ప్రదక్షిణలు చేస్తున్నట్లో చెప్పాలని ప్రశ్నించారు.

# భారత భూమే “యోగ భూమి!” ....

### యావత్ ప్రపంచానికే ‘యోగా ను నేర్పిన ”విశ్వగురువు భారతదేశం”

### సామాజిక సామరస్యానికి గొప్ప ఉపకరణం “యోగా”

### “నవజీవనయోగం..“యోగ నాదం” !కు వేదికైన ఏ ఎన్ యు

### ఎ ఎన్ యు కేంద్రంగా గుంటూరు జిల్లా ను“యాగాంధ్ర 2025 కు సమాయత్తం చేసిన జిల్లా యంత్రాంగం

### “ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు జిల్లా కలెక్టర్ జి నాగలక్ష్మి ఐ ఎ ఎస్”







**అక్షర విజేత మంగళగిరి...**

బుధవారం, నాగార్జున వర్సిటీ(జూన్18): మానవాళికి మానసిక, శారీరక సౌభాగ్యాన్ని ప్రసాదించే శక్తివంతమైన యోగ మార్గం “యోగా”. సామాజిక సామరస్యానికి గొప్ప ఉపకరణం “యోగా”. మానవ మనఃతాపాన్ని తగ్గించడంలో , మనసుకు ప్రశాంతతను కలిగించడంలో “యోగా”దే అగ్రస్థానం.భారత భూమే “యోగ భూమి!” యావత్ ప్రపంచానికే ‘యోగా’ ను నేర్పిన విశ్వగురువు భారతదేశం”!.సామాజిక సామరస్యానికి గొప్ప ఉపకరణం “యోగా”.. అందుకే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతదేశవ్యాప్తంగా ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పిలుపుమేరకు యావత్ భారతదేశం “యోగా” పై దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా “యోగాంధ్ర 20 25 కార్యక్రమం ను చేపడుతున్నారు.ఇందులో భాగంగా బుధవారం గుంటూరు జిల్లా యంత్రాంగం సమిష్టి కృషితో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులతో, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో యోగాంధ్ర 2025 కార్యక్రమంను నిర్వహించారు.ఈ కార్యక్రమములో ముఖ్యఅతిథిగా ఐఏఎస్ అధికారిణి గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పాల్గొన్నారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ భార్గవ తేజ,రాష్ట్రఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె మధుమూర్తి,కృష్ణ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కె రామ్ జీ,ఎ ఎన్ యు తాత్కాలిక ఉపకులపతి కె గంగాధర రావు తదితరులు అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భముగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐ ఎ ఎస్ అధికారిణి గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆమె మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర2025 వేడుకలను జిల్లాలో అత్యంత ఘనంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడమైనదని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. యోగా పై అవగాహన కల్పించడానికి నిర్వహించు కార్యక్రమాలలో మాస్టర్ ట్రైనర్ లను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి, వారి ద్వారా సచివాలయ పరిధిలోని వారికి రిజిస్ట్రేషన్ చేసి వారి ద్వారా మూడు దశలలో శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఇది ఒక్క రోజులో చేసి వెళ్లే కార్యక్రమం కాదని, ఒక అలవాటుగా చేసుకుని నిరంతరం అభ్యసించేలా చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు జిల్లా వ్యాప్తంగా ఐదువేల ప్రాంతాలలో 5000 మందితో కార్యక్రమం చేయబోతున్నామని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరిలో శారీరక, మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత తోపాటు ఆధ్యాత్మిక వృద్ధిని పెంపొందించే సమగ్ర వ్యవస్థగా యోగా దోహదపడుతుందన్నారు. జీవితంలోని ఒత్తిళ్లను ఎదుర్కోవడానికి సమర్ధవంతమైన సాధనముగా యోగ ఆసనాలు ప్రయోజనకరముగా ఉంటాయని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరు యోగా చేయడం ఒక అలవాటుగా మార్చుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కాపాడటానికి యోగా ఒక సన్మార్గమని యోగా మన దినచర్యలో భాగంగా చేపట్టాలని సూచించారు. యోగాతో పరిపూర్ణమైన మానవులుగా తయారవుతారని ప్రపంచానికి



ఒక సంకేతాన్ని పంపించాలని కోరారు. శారీరక దారుఢ్యం తో పాటు, మానసిక ఉత్తేజాన్ని అందించుటలో యోగా దోహదపడుతుందని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే వ్యాయామం, యోగా, నడక వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.ఎ ఎన్ యు తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ ఆధునిక జీవితంలో ఒత్తిడి అంతర్లీనంగా దాగి ఉందని, యోగాతో ఒత్తిడినీ తగ్గించుకొని సంతృప్తికరమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు.యోగా వేడుకలకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధకులకు, ఆయా కళాశాలల యాజమాన్యాలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.వర్సిటీ యోగ శిక్షకురాలు ఏ. రాధిక ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది యోగాసనాలు చేపట్టారు.




అనంతరం యోగా ప్రతిజ్ఞతో పాటు, దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడానికి దృఢ నిర్ణయం తీసుకుందామంటూ ప్రతిజ్ఞ చేశారు.

**“వర్శిటీ యోగా కేంద్రానికి చెందిన విద్యార్థిని చేసిన నృత్యం అందరినీ మంత్ర ముగ్ధులను చేసింది.”**

ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ. భార్గవ తేజ,కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కూన రామ్ జీ,ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి. గణేష్ కుమార్, ఎ ఎన్ యు తాత్కాలిక రెక్టార్ ఆచార్య కే. రత్నషీలా మణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం,గుంటూరు ఆర్డీవో కృష్ణ కాంత్ లతోపాటు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అకాడమిక్ అడ్వైజరీ ఆచార్య జి రోశయ్య, వర్సిటీ పాలకమండలి సభ్యులు ఆచార్య కెసుమంత్ కుమార్, ఆచార్య జగదీష్ నాయక్,ఆచార్య ఎమ్ త్రిమూర్తి రావు, దూర విద్యా కేంద్ర సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు,ఎ ఎన్ యు పరీక్షల సర్వ నియంత్రణాధికారి ఆలపాటి శివ ప్రసాద రావు, అనుబంధ కళాశాలల ప్రచార్యులు, అధ్యాపకులు,జిల్లా లోని వివిధ శాఖలకు చెందిన సిబ్బంది,జిల్లా యంత్రాంగం, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తెలుగు శాఖ విభాగాధిపతి, వర్శిటీ యూజీ కోర్సుల సమన్వయకర్త ఆచార్య నారి శెట్టి వెంకట కృష్ణారావు సభాధ్యక్షులుగా వ్యవహరించి తనదైన శైలిలో కార్యక్రమాన్ని యోగా యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ,యోగా పై ప్రభుత్వము చేపడుతున్న కార్యక్రమ ఉద్దేశ్యాన్ని అర్థవంతంగా చెప్తూ అందరినీ ఆలోచింపజేశారు.

# కొల్లేరు ప్రాంతంపై అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసిన కేంద్ర సాధికార కమిటీ

**అక్షరవిజేత., ఏలూరు:-**

కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్రశేఖర్ గోయల్, మెంబెర్ కార్యదర్శిలు డా. జె.ఆర్. భట్, జి. భానుమతి, కమిటీ సభ్యులు సునీల్ లిమాయే, ప్రకాష్ చంద్ర భట్, కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కొల్లేరు ప్రాంతంలో పర్యావరణం, కాలుష్యం, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రహదారులు,భవనాలు, ఏలూరు నగరపాలక సంస్థ, ఆర్ డబ్ల్యూఎస్, తదితర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ గోయల్ మాట్లాడుతూ ఉప్పుటేరు లోకి కలిసే ఇరిగేషన్ డ్రైన్లు, డ్రైన్ల ద్వారా కొల్లేరులోకి వచ్చే కాలుష్యం నివారణకు తీసుకుంటున్న చర్యలు, డ్రైన్ల డీసిల్టింగ్ పై నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ నాగార్జునరావు ని కమిటీ సభ్యులు ఆదేశించారు. కొల్లేరు 5వ కాంటూర్ పరిధిలో 47 నాన్–నోటిఫైడ్ డ్రైన్లు, కొల్లేరు 5వ కాంటూర్ అవతల 67 నోటిఫైడ్ డ్రైన్లు ఉన్నాయన్నారు. ఇవి అన్ని ఉప్పుటేరులో కలుస్తాయన్నారు. కొల్లేరు వన్యప్రాణి అభ్యరణ్యంగా ప్రకటించాక ముందు కొల్లేరు గ్రామాలలోని అంతర్గత రోడ్లు, గ్రామాలను కలిపే లింక్ రోడ్లు, ప్రస్తుతం వాటి నిర్వహణ, కొత్తగా నిర్మించిన, నిర్మించే రోడ్లపై మరియు కొల్లేరు అభయారణ్య పరిధిలో రోడ్ల నిర్మాణం, రోడ్ల నిర్వహణ లపై ఉన్న సమస్యలపై నివేదిక అందించాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణమూర్తి ని కమిటీ సభ్యులు ఆదేశించారు. అనంతరం ఏలూరు నగరం పారిశుద్ధ్య వ్యర్ధాలు, వ్యర్థాల శుద్దీకరణ సామర్థ్యం, కొల్లేరులో కలిసే ఏలూరు నగరంలోని పారిశుద్ధ్య వ్యర్థాలు వివరాలపై నివేదిక సమర్పించాలని ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ను కమిటీ సభ్యులు ఆదేశించారు. ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో 32 ఎంఎల్ డి వ్యర్థాలు విడుదల అవుతాయని, వీటిలో పారిశుద్ధ్య వ్యర్థాలు 7 ఎంఎల్ డి ఉంటాయన్నారు. 5 ఎంఎల్ డి వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్ ఏలూరులో ఉన్నదన్నారు. మరో 50 ఎంఎల్ డి వ్యర్థాలు శుద్దీకరణ ప్లాంట్ ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. మిగిలిన వ్యర్థాలు తమ్మిలేరు ద్వారా కొల్లేరు కలుస్తున్నాయని కమిటీ సభ్యులకు తెలియజేసారు. కొల్లేరు పరిధిలో పర్యావరణం , కాలుష్య పరిస్థితులు, చేపల పెంపకానికి వినియోగించే నీరు, త్రాగునీటి కాలుష్యం, పరిశ్రమల ద్వారా కొల్లేరులోకి వెళ్లే వ్యర్థాల కారణంగా కలిగే కాలుష్యం, తదితర వివరాలపై సవివరమైన నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావు ను కమిటీ సభ్యులు ఆదేశించారు. కొల్లేరులో త్రాగునీరు, భూగర్భ జలాలు, డ్రైన్లలో కాలుష్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావు కమిటీ కి తెలియజేసారు. కొల్లేరులో ఎన్ని రకాల చేపల పెంపకం జరుగుతుంది, కాలుష్య నీటిలో ఉత్పత్తి అయ్యే చేపల వినియోగం కారణంగా అనారోగ్య సమస్యలు, చేపల పెంపకానికి వినియోగించే రసాయనిక ఎరువులు, పురుగుమందుల వివరాలు, వాటి కారణంగా కొల్లేరులో కలిగే కాలుష్యం, తదితర విషయాలపై నివేదిక సమర్పించాలని మత్స్య శాఖాధికారులను కమిటీ సభ్యులు ఆదేశించారు. మత్యశాఖ కమీషనర్ రమాశంకర్ నాయక్ మాట్లాడుతూ బుడమేరు ద్వారా విజయవాడ నగరంలోని వ్యర్థాలు కొల్లేరులో కలుస్తున్నాయని వివరించారు. కమిటీ కోరిన సమాచారం ను సంబంధిత శాఖల






అధికారులు జిల్లా కలెక్టర్ ద్వారా కమిటీ కి త్వరితగతిన పంపాలని కమిటీ సభ్యులు ఆదేశించారు. రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు డా. కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు,అటవీ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, అటవీ ప్రిన్సిపాల్ చీఫ్ కన్సర్వేటర్ అజయ్ కుమార్ నాయక్, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, డిఎఫ్ఓ లు శుభం, విజయ,డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు చంద్రశేఖర్ గోయల్, మెంబెర్ కార్యదర్శిలు డా. జె.ఆర్. భట్, జి. భానుమతి, కమిటీ సభ్యులు సునీల్ లిమాయే, ప్రకాష్ చంద్ర భట్ లను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి దుశ్శాలువా, మెమెంటోలతో సత్కరించారు.

## హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ ను ఏర్పాటు...

### బ్యాచ్ 16 మంది చొప్పున 32 రోజులపాటు శిక్షణ ..ఆర్టీసి డిపో మేనేజర్ సత్య నారాయణ మూర్తి....



**అక్షరవిజేత,భీమవరం :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నట్లు భీమవరం డిపో మేనేజర్ పిఎన్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. బుధవారం భీమవరం ఆర్టీసీ డిపోలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తేలికపాటి లైసెన్స్ కలిగి ఉన్నవారికి ఏపీఎస్ ఆర్టీసీ శుభవార్త అని, భారీ వాహన రంగంలో డ్రైవర్ల కొరతను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ సర్టిఫికెట్ తో లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ ను హెవీ లైసెన్ గా పొందటానికి నిపుణులతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. బ్యాచ్ కు16 మందికి 32 రోజులపాటు శిక్షణ అందిస్తున్నామని, మొదటి బ్యాచ్ పూర్తి అయిన తరువాత రెండో బ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు. శిక్షణకు లైట్ మోటర్ వెహికల్ లైసెన్స్ పొంది ఏడాది కాలం అయివుండాలని, హెవీ వాహన లైసెన్స్ కొరకు ఎల్ఎల్ఆర్ తీసుకొని ఉండాలని, కనీస వయస్సు 20 సంవత్సరాలు దాటి ఉండాలని అన్నారు. త్వరలో డ్రైవింగ్ క్లాసులు ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరి న్ని వివరాలకు 73829 24 754 కు సంప్రదించాలని అన్నారు. అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్, ట్రైనర్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఒత్తిడి నుంచి యోగా విముక్తి....

### 20 రోజులుగా యోగ అభ్యసన కార్యక్రమాలను నిర్వహించుకోవడం అభినంద నీయం .. సర్పంచ్ వంశీరాజు....



**అక్షరవిజేత,కుముదవల్లి :**

జిల్లా వ్యాప్తంగా గ్రామ, మం డల, డివిజన్ లోని పలు ప్రాంతాల్లో గత 20 రోజులుగా యోగ అభ్యసన కార్యక్ర మాలను నిర్వహించుకోవడం అభినందనీయమని కుముద వల్లి గ్రామ సర్పంచ్ వంశీరాజు అన్నారు. పాలకోడేరు మండ లం కుముదవల్లి గ్రామంలో శ్రీవిజ్ఞానవేదిక గ్రామస్థుల ఆధ్వ ర్యంలో యోగాంధ్ర కార్యక్రమం లో భాగంగా యోగాసనాలు నిర్వహించారు. వంశీరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలని, యోగాస నాలు వేయడం ద్వారా క్రమ శిక్షణ, మెరుగైన జీవన విధా నం అలవడుతుందన్నారు మానసిక ఒత్తిడి నుంచి ప్రజల ను యోగా విముక్తి కల్పిస్తుంద న్నారు. నిర్వాహకులు చెరుకు వాడ రంగసాయి మాట్లా డుతూ నాణ్య మైన జీవితం యోగాతోనే సాధ్యమని, యోగా జీవితంలో ఒక భాగం కావాలన్నారు. 21న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమంలో అందరూ భాగ స్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో యోగ గురు వులు సత్యనారాయణ రాజు, వెంకటేశ్వరరాజు, రామరాజు, గ్రామస్థులు, విఆర్వోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్య నుంచే యోగపై శిక్షణ అందించాలి....




**అక్షరవిజేత,భీమవరం :**

పాఠశాల విద్య నుంచే యోగపై శిక్షణ అందించాలని లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు, సంస్కార్ స్కూల్ డైరెక్టర్ నందమూరి రాజేష్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం బ్యాంక్ కాలనీలోని సంస్కార్ స్కూల్ వద్ద బుధవారం యోగ అవగాహనా ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ యోగా మన జీవితంలో ఒక భాగంగా మారితే సంపూర్ణ ఆరోగ్యం మన సొంతం అవుతుం దన్నారు. ప్రిన్సిపాల్ అడపా సత్యవతి మాట్లాడుతూ యోగాసనాలతో కలిగే ప్రయోజనాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఎలాంటి ఖర్చు, మందులు లేకుండా రోగాలు నివారించడం యోగాతోనే సాధ్యమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన యోగ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, హేమ, అనిత తదితరులు పాల్గొన్నారు.

## మారేడుమిల్లిలో ఎదురు కాల్పులు

**అక్షర విజేత,మారేడుమిల్లి:**





రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి అడవుల్లో ఎన్కౌంటర్ పోలీసులు- మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేతలు ఉదయ్, అరుణ మృతి మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు ఉదయ్మావోయిస్టు జోనల్. కమిటీ. సభ్యురాలు అరుణ.కాల్పుల్లో మరో మావోయిస్టు మృతిచెందినట్టు సమాచారం.వారివద్దనుంచి మూడు ఏకే-47 గన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు.

పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

**అక్షర విజేత అరకులోయ.**

అరకులోయ నియోజకవర్గంలో ఆరు మండలంలోని పంచాయతీ పరిధిలో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు సేవలు అందించాలని అరకులోయ శాసనసభ్యులు రేగం మత్స్య లింగం విజ్ఞప్తి చేశారు. బుధవారం అరకు నియోజకవర్గం డుంబ్రిగూడ మండల పోతంగి పంచాయితీ గ్రామ సచివాలయాన్ని ప్రభుత్వ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. శాసనసభ్యులు 10:45 నిమిషాలకు సచివాలయాలకు వెళ్ళగా అక్కడ కేవలం కార్యదర్శి తప్ప ఇతర సచివాలయ ఉద్యోగులు ఎవరు లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటలకే హాజరు కావలసి ఉందని ఆయన అన్నారు. అయినప్పటికీ సచివాలయ ఉద్యోగులు ప్రజా సేవలను విస్మరించి సమయపాలన పాటించకుండా గంటల తరబడి లబ్ధిదారులను కాలయాపన చేయడం తీవ్ర విచారకరమని ఎమ్మెల్యే మత్స్యలింగం అన్నారు. కూటమి ప్రభుత్వం జమ చేసిన తల్లికి వందనం నిధులు అనేకమంది తల్లుల ఖాతాలలో జమ కాకపోవడంతో వారు అర్జీల కోసం సచివాలయాలకు క్యూ కడుతున్నారని ఇటువంటి తరుణంలో సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటిస్తే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అన్నారు. తల్లికి వందనం డబ్బులు జమ కాకపోవడంతో ఉదయం 9 గంటలకే తల్లులు సచివాలయాల వద్ద క్యూ కడుతున్నారని దీని దృష్టిలో పెట్టుకొని సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించి తల్లులకు ఎటువంటి అగచాట్లు లేకుండా వారు అర్జీలను నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఈనెల 25వ తేది వరకే ఆర్జీలు కు సమయం ఉండడం ఏజెన్సీ ప్రాంతంలో వాతావరణ పరిస్థితి వలన విద్యుత్ సౌకర్యం అంతరాయం తరచు ఏర్పడుతుండడంతో ఈనెల



25 తేదీ వరకు సచివాలయాల ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం కోరారు. గత రెండు రోజులుగా ఆర్జీల కోసం తల్లులు తల్లికి వందనం కోసం సచివాలయాల చుట్టూ,బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారని ఆయన గుర్తు చేస్తున్నారు. దీని దృష్టిలో పెట్టుకొని సచివాలయాల ఉద్యోగులు మానవత దృకృథంతో విధులు నిర్వహించాలని ఆయన కోరారు.

# పంట పొలాలకు సాగునీటి రైతు లు కష్టాలు గొట్టు ఎక్కించిన గారపాటి

### -చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి ఆధ్వర్యంలో తవ్వకాలు,



**అక్షర విజేత ఆలమూరు**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరులో సుదీర్ఘ కాలంగా ముసుకుపోయి రైతులకు ఇబ్బందికరంగా మురుగు నీటి డ్రైన్ కు ఎట్టకేలకు మోక్షం లభించింది.



ఆలమూరు, జొన్నాడ గ్రామాలకు చెందిన పంట భూముల్లో వర్షాలకు ముంపు గురై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆలమూరు మండలం చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరికి రైతులు తీసుకొచ్చారు. దీంతో ఆయన స్థానిక ఎంపీడీవో ఏ రాజుతో చర్చించి ఈ డ్రైన్ పరిస్థితిని వివరించారు. ప్రజలకు రైతులకు ఇబ్బంది కలిగే విషయంపై తక్షణం స్పందించి తవ్వకాలు ప్రారంభించాలని ఎంపీడీవో రాజు చెప్పడంతో బుధవారం డ్రైన్ తవ్వకాలు ప్రారంభించారు. సుదీర్ఘ కాలంగా ఈ డ్రైన్ తవ్వకాలు చేపట్టకపోవడంతో డ్రైన్ పూర్తిగా మూసుకుపోయి మురుగునీరు దిగుకు వెళ్లడం లేదని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ట్రైన్ తవ్వకాలు ప్రారంభించినట్లు శ్రీనివాస్ చౌదరి చెప్పారు. పంట భూములకు సాగునీరు ఎంత ముఖ్యమో వర్షాకాలంలో పంట భూముల్లోని అదనపు నీరు దిగువకు పోవడం కూడా అంతే ముఖ్యమని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని చింతలూరు సాగునీటి సంఘం పరిధిలోని అనేక డ్రైన్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, ఆలమూరు మండల కుటమి నాయకులు సహకారంతో తవ్వకాలు చేపట్టినట్లు ఆయన చెప్పారు.

# అవినీతి రహిత పరిపాలన తోనే అభివృద్ధి

### ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్

**అక్షర విజేత పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:**

ప్రజా ప్రతినిధులు అవినీతి రహిత పరిపాలన అందించిన నాడే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని సుభిక్షంగా ఉంటారని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి ఆకాంక్షించి గెలిపించారని, అదేవిధంగా వారు సహాయ సహకారాలు అందించిన నాడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వారికి ప్రజలు సహకరించాలని కోరారు. పారిశుధ్యం విషయంలో ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఇష్టానుసారంగా చెత్త పారే వేయకుండా కంపోస్ట్ యాడ్ నందు ట్రాక్టర్ ద్వారా వదిలివేయాలని కోరారు. ఉదయం 6 గంటల నుండి మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో పారిశుధ్యన్నీ నిర్వహిస్తామని ప్రజలు సహకరించాలని కోరారు. అక్రమంగా చెరువులను ఆక్రమించిన ఎడల చర్యలు తీసుకుంటారని అధికారులు ఆ దిశగా ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. ఆక్రమణ దారులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అటువంటి ప్రదేశాలను ఎమ్మార్వో ఆధ్వర్యంలో గుర్తించి కంపోస్ట్ యార్డ్ గా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి పౌరుడు నడుం బిగించాలని తద్వారా రాష్ట్రం అభివృద్ధికి సహకరించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి దాతల సహకారం ఎంతైనా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. పారిశుధ్యం ను మెరుగుపరిచేందుకు అవసరమైన ట్రాక్టర్ లు, వాటర్ ఫిల్టర్స్ వంటి వాటిని దాతలు అందజేస్తే వారి పేర్లను అభివృద్ధిలో పొందుపరుస్తామన్నారు. గత ప్రభుత్వ అవినీతి పాలనతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్రామాలలో సి ఎఫ్ ఎస్ ఎమ్ పేరుతో వైసిపి పాలనలో భారీ అవినీతికి పాల్పడ్డారని ఆయన




దుయ్యబట్టారు. గత ప్రభుత్వ పాలనలో సిఎఫ్ఎస్ఎమ్ పేరుతో నియోజకవర్గంలో ఐదు సంవత్సరాలలో 10 కోట్లకు పైగా అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేయడంలో వైసిపి పాలకులు సిద్ధహస్తులని, రాష్ట్రవ్యాప్తంగా కేవలం చెత్త తరలింపు వాహనాలపై నెలకు రూ 50 వేలు ప్రజాధనాన్ని నేరుగా జగన్ ఖాతాకు తరలించిన ఘనత వారికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ పి ఎం ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు, తాసిల్దార్ సునీల్ కుమార్, పెంటపాడు తాసిల్దార్, రాజరాజేశ్వరి, డి రవిబాబు, ఎండిఓ రంగనాథ్, ఎండిఓ బాలాజీ, డి ఈ ఈ పబ్లిక్ హెల్త్ విజయ్, ఇరిగేషన్ ఏ ఈ ఈ సుధారాణి పాల్గొన్నారు

# జవహర్ నవోదయ బనవాసి విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్

**అక్షర విజేత ఎమ్మిగనూరు**

నవోదయ విద్యాలయ సమితి వారు 2026-27 వ విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయ బనవాసిలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు కోరుచున్నారు. కావున అర్హులైన అభ్యర్థులందరూ ఈ వెబ్ సైట్ ద్వారా : అప్లై చేసుకోవలయును. అభ్యర్థులు చివరి నిమిషం వరకు వెయిట్ చేయకుండా త్వరగా అప్లై చేసుకోవలసిందిగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఈ.పద్మావతి ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రత్యేక అంశాలు: 1.దరఖాస్తు విధానం: ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. 2. అభ్యర్థులు 3వ, 4వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. 3. 5వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలి. 4. అభ్యర్థులు ఉమ్మడి కర్నూల్ జిల్లా(కర్నూల్ మరియు నంద్యాల) ప్రాంతం వారు మాత్రమే అప్లై చేసుకోవలయును. 5. అభ్యర్థులు 01.05. 2014 నుండి 31. 07. 2016 మధ్య జన్మించిన వారై ఉండాలి. 6. దరఖాస్తుకు చివరి తేదీ: 29-07-20257. ఎంపిక పరీక్ష తేదీ : 13-12-2025 (శనివారం)

పూర్తి వివరాలకు ఈ క్రింది వెబ్సైట్ను సంప్రదించవలెయును



# అందరి ఆరోగ్యం కోసం యోగాంధ్ర -తోట సీతా రామలక్ష్మి....



అక్షరవిజేత,భీమవరం:

ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రపంచ యోగ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 21తేదీన విశాఖ పట్నంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జయంప్రదం చేయాలని భీమవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పోలీట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు.భారత ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ హాజర వుతున్న అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో 5 లక్షల మంది పాల్గొనేలా ఇప్పటికే కార్య చరణ రూపొందించార న్నారు.రాష్ట్రమంతా నిర్వ హిస్తున్న అందరికీ ఆరోగ్యాన్ని ఇచ్చే యోగ కార్య క్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## డి పోలవరం గ్రామంలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు





అక్షర విజేత కోటనందూరు.

కాకినాడ జిల్లా,తుని నియోజకవర్గం,తుని మండలంలో ప్రభుత్వ విఫ్ యనమల దివ్య, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పర్యటించారు.డి.పోలవరంలో సీనియర్ డాక్టర్ పలకా సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఎంపీ ఎమ్మెల్యే హాజరైయ్యారు.ఇందులో భాగంగా 40 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎంపీ ఎమ్మెల్యేలు ప్రారంభించారు.అనంతరం ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగామాట్లాడుతూ సంపూర్ణం ఆరోగ్యం,మానసిక ప్రశాంతత కుయోగా ఎంతగానో దోహదపడుతుందని అందుచేత యోగాను ప్రతి ఒక్కరూ వ్యాపకంగా అలవర్చుకోవాలన్నారు .ఈకార్యక్రమంలో సీనియర్ నేతలు చింతంనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు,యనమల లక్ష్మణరావు,అరిగెల నర్సింహమూర్తి,జనసేన నాయకులు బోనం చినబాబు,దండెం రామకృష్ణ, స్థానిక నాయకులు అలమండ వెంకట రమణ,వాడబోయిన సాంబయ్య,పెనుబోతుల నూకరాజు,బర్ల చిన్న,బర్ల గోవిందు,సుర్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను వంచించిన ప్రభుత్వం

## మాజీ ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



అక్షర విజేత పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:

ఇచ్చిన హామీలను అమలు చేస్తామంటూ కూటమి ప్రభుత్వం ఏడాదికాలంగా ప్రజలను నమ్మించి వంచిం చిందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ అన్యాయం జరిగిన ప్రశ్నిస్తా అని చెప్పిన పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి లోకేష్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏడాది కాలంలో లక్ష 50 కోట్ల రూపాయలు అప్పు తెచ్చి చంద్రబాబు తమ యంత్రాంగానికి దోచిపెడుతున్నారు అన్నారు. యువగలం పాదయాత్రలో జాబ్ క్యాలెండర్ ఇస్తానన్న లోకేష్ హామీని మర్చిపోయారా అని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకంపై కూటమి నాయకులు డబ్బులు కోసం తాపత్రయపడుతున్నారు అన్నారు. మహిళలకు హామీ ఇచ్చిన ఉచిత బస్సు పథకాన్ని ఏ ఆగస్టులో చేపడతారో చెప్పాలన్నారు. కూటమి పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన తప్పులను ప్రజలు ఎక్కడ నిలదీస్తారని విషయాన్ని పక్కదారి పట్టించేలా రాజకీయాలు చేస్తున్నారన్నారు. పిఠాపురంలో జనసేన కార్యకర్త అన్యాయాన్ని ప్రశ్నించారని గురించి వెలివేస్తే పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించలేదని ఆయన అన్నారు. ప్రస్తుత శాసనసభ్యులు తాడేపల్లిగూడెంలో ఎక్కడైనా ఒక్క రోడ్డు వేశారా అని వేస్తే ఎక్కడ చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పురపాలక సంఘం ఆస్తులు ఆక్రమిస్తుంటే కమిషనర్ ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెంలో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి జీవో వచ్చిందంటున్న నాయకులు ఎంత కాలంలో పూర్తి చేస్తారో చెప్పాలన్నారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొలుకూరి ధర్మరాజు, కర్రీ భాస్కర్ రావు, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, కైకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హై కోర్టు అత్యవసర నోటీసులను బేఖాతరు చేస్తున్న అధికారులు భవిష్యత్ పరిణామాలకు పూర్తి బాధ్యత వహించాలి

**చిలువూరు మాదిగ పల్లె శ్మశాన వాటిక దురాక్రమణలు తొలగించకుండా బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్న అధికారులు**

**శాఖాపరమైన చట్టపరమైన నిర్ధిష్ట కఠిన చర్యలు తీసుకోవాలి**

**హై కోర్టు అత్యవసర నోటీసులను భేఖాతరు చేస్తున్న అధికారులపై ...మరలా హై కోర్టు కు చేస్తాం.**

**ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ %ౡ% న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ హెచ్చరిక**






అక్షర విజేత దుగ్గిరాల:

చిలువూరు గ్రామం మాదిగ పల్లె శ్మశాన వాటిక పరిసరాలు కొన్ని దశాబ్దాలకు పూర్వం అగ్రవర్ణాలచే దురాక్రమణకు గురైందని సదరు దురాక్రమణలు తొలగించి సమకాలీన అవసరాల మేరకు స్మశాన వాటిక విస్తరించాలని , సదరు శ్మశానవాటిక కు నిర్ధిష్ట రహదారి ఏర్పాటు చేయడం ద్వారా మాదిగ జాతి ఆత్మ గౌరవాన్ని కాపాడాలని మరియు సదరు దురాక్రమణ దారులు %ౡ% వారికి సహకరిస్తున్న సంబంధిత అధికారగణంపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హై కోర్టు కు ఫిర్యాదు చేయగా 2022 లో చట్ట పరిధిలో సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించవలసిందిగా గుంటూరు జిల్లా కలెక్టర్ కు అత్యవసర నోటీసులు జారీ చేసినది. సంబంధిత అధికారులు సదరు అగ్ర వర్ణ దురాక్రమిత భూమికి సంబంధించి ఎలాంటి డాక్యుమెంటును తీసుకోకుండా నామ మాత్ర సర్వే చేసి నిర్లక్ష్యంగా %ౡ% బాధ్యతా రాహిత్యంగ ప్రవర్తించడాన్ని నాగరాజు మాదిగ ఖండించారు. సదరు ఆక్రమిత భూమికి సంబంధించి అగ్రవర్ణ ఆక్రమణదారులకు ఎలాంటి డాక్యుమెంట్ లేనప్పటికీ ఆక్రమణదారులకు సహకరిస్తూ సంబంధిత అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని నాగరాజు మాదిగ ఆరోపించారు.ఈ క్రమంలో నిర్ధిష్ట సర్వే నిర్వహించి ఎలాంటి డాక్యుమెంట్ ఆధారం లేనీ సదరు భూమినీ స్మశాన వాటికకు అనుసంధానం చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని నెలల క్రితం గుంటూరు జిల్లా కలెక్టర్ మరియు స్థానిక దుగ్గిరాల తహసీల్దార్ లకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యను పరిష్కరించకుండా అగ్రవర్ణ దురాక్రమన్నదారులకు సపోర్ట్ చేసే విధంగా అధికారులు ప్రవర్తించడాన్ని నాగరాజు మాదిగ ఖండించారు.ఈ రోజు స్థానిక దుగ్గిరాల తహశీల్దార్ ను కలిసి హై కోర్టు నోటీసులకు అనుగుణంగా సదరు స్మశానవాటిక దురాక్రమణకు వెంటనే తొలగించాలని కోరారు. నిర్ధిష్ట కాల పరిమితి లో సదరు దురాక్రణలు తొలగించకపోతే సంబంధిత అధికారులపై మరలా హై కోర్టు కు ఫిర్యాదుంచేస్తానని నాగరాజు మాదిగ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగ సమాక్య రాష్ట్ర నాయకు ప్రొఫెసర్ నలుకుర్తి కోటేశ్వర రావు మాదిగ , వద్దేశ్వరపు కమలాకర్ మాదిగ నన్నెపాగ రామ్ మోహన్ మాదిగ , రామగిరి రాజు మాదిగ, నన్నెపాగ ప్రాణమ్మ తదితరు పాల్గొన్నారు

# అట్టహాసంగా 21వ తేదీన వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ చినిమిల్లి వెంకట రాయుడు ప్రమాణ స్వీకారం...

అక్షరవిజేత,భీమవరం:

భీమవరం నరసయ్య అగ్రహారంలో వైఎస్సార్ సీపీ భీమవరం నియోజవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ భీమవరం ఇన్ఛార్జ్ చినిమిల్లి వెంకటరాయుడు తెలిపారు. బుధవారం రాయలంలో వారి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్సీ, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, 6 నియోజక వర్గాల ఇన్ ఛార్జ్ లు, జిల్లా నాయకులు హాజరవుతున్నా రని తెలిపారు. ప్రతి కార్యకర్త ను కలుపుకుని పార్టీ బలోపే తానికి కృషి చేస్తానని, భీమవ రం నియోజకవర్గంలో వైఎ స్సార్ సీపీ పార్టీ అభివృద్ధికి శక్తివంచనతో చిత్తశుద్ధితో పని చేస్తానని అన్నారు. 21న భీమవరం కోడవల్లి రోడ్ లోని కేఎస్ రాజు ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు భీమ వరం నియోజవర్గ విస్తృత స్థాయి సమావేశం తోపాటు ప్రమాణ స్వీకారం కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేయాల ని కోరారు. పార్లమెంట్ ఇన్ ఛార్జ్ గూడూరి ఉమాబాల, పట్టణ అధ్యక్షుడు గాది రాజు రామరాజు, కామన నాగేశ్వర రావు, మేడిద జాన్సన్ మాట్లా డుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఇన్ ఛార్జ్ లతో కలసి పని చేస్తామని అన్నారు. విలే కరుల సమావేశంలో ఏఎస్ రాజు, కోడె యుగంధర్ భీమవరం మండల కన్వీనర్ జల్లా కొండయ్య, వీరవాసరం



# భీమవరం చిన్న పేటలో దారుణ ఘటన...

## ఒక వ్యక్తిపై ఇద్దరు వ్యక్తుల దాడి వారిపై కేసు నమోదు...

అక్షరవిజేత,భీమవరం :

భీమవరం చిన్న పేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దారుణ ఘటన. వివరాల్లోకి వెళితే భీమవరంలోని బ్యాంక్ కాలనీలోని కిరాణా దుకాణంలో జరిగిన దాడిలో ఉద్దేశ్యపూర్వకంగానే గాయపరిచిన కేసు 16వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు నివేదించబడింది. ఫిర్యాదుదారు నేతల పాల్ %ూ/శీ% ప్రేమానందం, వయస్సు 33 సంవత్సరాలు, కులం: %ాజ% మాల, 28వ వార్డు, బ్యాంక్ కాలనీ, భీమవరం నివాసి, తాను ఇనుప దుకాణంలో పనిచేస్తున్నానని పేర్కొన్నాడు. 15 వ తేదీన అతను లూథరన్ చర్చి యొక్క 25వ వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యాడు, తరువాత భోజనం చేసాడు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదుదారునికి మరియు నిందితులు %ూ%1) సత్తాడ శాస్త్రి %ూ%2) సత్తాడ సుదీర్ కు మధ్య కొన్ని చిన్న చిన్న వివాదాలపై వాగ్వాదం జరిగింది. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత, ఫిర్యాదుదారుడు సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో ఒక కిరాణా దుకాణానికి వెళ్లాడు. ఆ సమయంలో, నిందితులిద్దరూ



కారులో వచ్చి, అతని వద్దకు వచ్చి, వాగ్వాదం చేసి, అతని ఎడమ కన్ను మరియు ఎడమ భుజంపై రెంచ్ తో కొట్టారు. మరియు చిన్న చిన్న వివాదాల కారణంగా అతని ఎడమ కంటి కింద రక్తస్రావం జరిగింది. తీవ్రంగా గాయాలు పాలవడంతో బాధితుడు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి వాంగ్మూలం ఆధారంగా, ఎస్సై ఎస్ కృష్ణజీ సి ఆర్. నెం.146/2025 %ఖ/ం% 118 (1), 3 (5) బి.ఎన్.ఎస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఈ నెల 21వ తేదీన ఏలూరులో 3 ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం

అక్షరవిజేత., ఏలూరు:-

5 వేల మందితో సర్. సి.ఆర్.రెడ్డి కళాశాలలో యోగాభ్యాసన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ పరిధిలో యోగాంధ్ర కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నద్ధత, తదితర అంశాలపై బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి .ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఈ నెల 21న అంతర్జాతీయ యోగాదినోత్సవం ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల 21 వతేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏలూరులోని సర్. సి. ఆర్ రెడ్డి కళాశాలలో 5వేల మందితో మెగా యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. దాని తోపాటు, ఇండోర్ స్టేడియం, మరొక ప్రాంతంలో కూడా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా జిల్లావ్యాపంగా వార్డ్/ గ్రామ సచివాలయాలు పరిధిలో గుర్తించిన వేదికలలో యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇంతవరకు యోగాంధ్ర కార్యక్రమంలో 9,2,421 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. యోగాభ్యాసన కార్యక్రమాలలో భాగస్వాములైన వారిలో ఇంతవరకు 6,91,418 మందికి సర్టిఫికెట్లను జారీ చేయగా, అందులో 29,639 మంది సర్టిఫికెట్ అఫ్ ఎక్సలెన్స్ పొందారన్నారు. సమావేశంలో డిఆర్ ఓ వి. విశ్వేశ్వరరావు, జిల్లాపరిషత్ సీఈఓ శ్రీహరి, డిఆర్డిఏ పీడీ విజయరాజు, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్, ట్రాన్స్కో ఎస్ఈ సల్మాన్ రాజు, సిపిఒ వాసుదేవరావు., డీఈఓ వెంకటలక్ష్మమ్మ, సెట్వేల్ సీఈఓ ప్రభాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ముక్కంటి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఆర్ఐఓ యోహాన్, ఆయుష్ డిడి లక్ష్మి శారద, డిఎంహెచ్ఓ డా.మాలిని, ప్రభృతులు పాల్గొన్నారు.



# ఈ నెల 20న బంద్ కు పిలుపునిచ్చిన మావోయిస్టులు

## ఏజెన్సీలో ముమ్మరంగా వాహన తనిఖీలు

అక్షర విజేత,పాడేరు:

విశాఖ ఏజెన్సీలో పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేస్తున్నారు... ఆపరేషన్ కగార్ నిలిపేయాలని ఈనెల 20న ఆంధ్రా, తెలంగాణాలో బంద్ నిర్వహించాలని మావోయిస్టు నేత జగన్ పిలుపునిచ్చారు.ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలు నిలుపుదల చేసి అనుమానితులను విచారిస్తున్నారు.

